క్లుప్తంగా

పీఓటీ భూమికి ప్లాట్ల కేటాయింపు



కందుకూరులో లబ్ధిదారుడికి ప్లాటు పత్రాలను అందజేస్తున్న ఆర్డీఓ

కందుకూరు: మండలంలోని అన్నోజిగూడకు చెందిన పుచ్చల కృష్ణ భూమి ఫార్మాసిటీలో భాగంగా ప్రభుత్వం సేకరించి ఏలాంటి పరిహారం ఇవ్వలేదు. ఆ భూమిని పీఓటీ కింద అధికారులు నమోదు చేశారు. దీంతో అప్పటి నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేదు. దీంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాకి దశరథ, కటికపల్లి సర్పంచ్ నరేందర్‌గౌడ్ చొరవ తీసుకుని అధికారులకు సమస్య వివరించారు. గురువారం ఆర్డీఓ సూరజ్‌కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారుడికి భూమి కింద 181 గజాల ప్లాట్లు కేటాయిస్తూ పత్రాలను అందజేశారు.

మధుయాష్కీని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



మధుయాష్కీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యులుగా ఇటీవల నియమితులైనా మధుయాష్కీగౌడ్‌ను మండలానికి చెందిన ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేష్ గురువారం ఆయన నివాసంలో సన్మానించారు. పార్టీ బలోపేతానికి మీ వెంట నడుస్తామని తెలిపారు. త్వరలోనే అన్ని నియోజకవర్గాలు, మండల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు మధుయాష్కీ వారికి తెలిపారు. మధుయాష్కీని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు జైపాల్ రెడ్డి, మధన్‌పాల్‌రెడ్డి, జగదీష్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

నిధుల కోసం వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పవన్‌కుమార్, నర్సిరెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ డివిజన్లలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని 10వ డివిజన్ కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్, 9వ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రామిడి నర్సిరెడ్డిలు గురువారం మంత్రి సబితా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 9, 10 డివిజన్ల పరిధిలోని కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఇతర సదుపాయాల గురించి మంత్రికి వివరించామని తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



ఘటనా స్థలంలో లారీ

మీర్‌పేట: అధికలోడుతో వెళ్తున్న లారీ నాలాలో కూరుకుపోయి బోల్తాపడింది. ఓంసాయి నగర్ కాలనీలో గురువారం అధిక లోడ్‌తో వచ్చిన లారీ.. మలుపు తీసుకుంటుండగా కాలువలో వెనుక చక్రాలు కూరుకుపోయి బోల్తా పడింది. బోల్తా పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే లారీ బోల్తా పడిందని కాలనీవాసులు తెలిపారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి కాలనీవాసులకు ఇబ్బంది కలుగకుండా లారీని అక్కడి నుంచి తరలించారు.

ముంపు కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన



వేంకటేశ్వర కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలను వరదనీరు ముంచెత్తింది. వెంకటేశ్వరకాలనీ, విజయపురికాలనీ, కల్కినగర్‌లలో మాన్‌సూన్ టీం సిబ్బంది నీటి మార్గాలను క్లియర్ చేశారు. స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ముంపు కాలనీలను సందర్శించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

తవ్వారు.. వదిలేశారు!



పోచమ్మబాగ్ కాలనీ రోడ్డు దుస్థితి

- తవ్వి వదిలేసిన రోడ్లు
- పాదచారులు, వాహనాదారుల ఇక్కట్లు
- అసంపూర్తిగా సీసీ ప్యాచ్‌వర్క్ పనులు
- పట్టించుకోని అధికారులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని పలుచోట్ల తవ్వి వదిలేసిన రోడ్లు ప్రమాదకరంగా మారాయి. మరికొన్ని చోట్ల సీసీరోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు చేయకపోవడంతో గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అంబేద్కర్ నగర్, భగత్‌సింగ్ నగర్, సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం పక్కనే ఉన్న పోచమ్మబాగ్ కాలనీ ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లోని రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. రోడ్లను అడ్డంగా తవ్వి వదిలేయడం వల్ల పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుంతలు పడ్డ రోడ్లపై తిరగడంతో వాహనాలు పాడైపోవడమే గాక నడుమునొప్పితో పలువురు బాధపడుతున్నారు. రోడ్ల దుస్థితిపై జీహెచ్ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు

అధికారుల్లో చలనం లేదు



జూన్ 1వ తేదీ తర్వాత రోడ్డుపై గుంత కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ఆదేశించినా అధికారుల్లో చలనం లేదు. వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. వర్షం కురిస్తే కష్టాలు మరింత పెరుగుతున్నాయి. – బిళ్లకంటి వేణుకుమార్, న్యాయవాది, చెరుకుతోటకాలనీ

నెల రోజులవుతున్నా...



చెరుకుతోట కాలనీ ప్రభుత్వ పాఠశాల ముందు డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగి మురుగునీరు రోడ్డుపై పారుతుండటంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. పోచమ్మబాగ్ కాలనీ రోడ్డు మధ్య భూగర్భ డ్రైనేజీ పైపులైన్ కోసం రోడ్డును తవ్వి పైపులైన్ వేసి మట్టితో పూడ్చారు. పనులు ప్రారంభించి నెల రోజులైనా డ్రైనేజీ పైపులైన్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాడు. – జహీర్, స్థానికుడు

బీజేపీ నాయకుల అరెస్ట్



కిషన్‌రెడ్డితో పాటు అరెస్టు అయిన స్థానిక నాయకులు

కందుకూరు: బాటసింగారం డబుల్ బెడ్రూం ఇండ్ల పరిశీలనకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన బీజేపీ కందుకూరు మండలానికి చెందిన నాయకులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. కిషన్‌రెడ్డితో పాటు మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతిపాండు, కొంతం జంగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, మందపాండు, సత్తయ్య, కె.చెన్నారెడ్డి, లింగంయాదవ్, దయాకర్‌రెడ్డి, గణేశ్‌దేవ్ తదితరులు అరెస్టైన వారిలో ఉన్నారు.

కిషన్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

కందుకూరు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు బీజేపీ నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ జిల్లా పంచాయతీరాజ్ సెల్ కన్వీనర్, కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలనకు నిదర్శమన్నారు. 9 ఏళ్లుగా ఊరిస్తూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు పంచకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం, రాష్ట్రానికి ఇస్తున్న నిధులను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు.

పోరుబాటను ఆపలేరు

బడంగ్‌పేట్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపుతో బాటసింగారంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్లిన బీజేపీ నేతలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బీజేపీ నేతల అరెస్ట్‌ను మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జీ అందెల శ్రీరాములు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాటసింగారంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అభద్రతాభావంతో అక్రమ అరెస్ట్‌లకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు.



అందెల శ్రీరాములను గృహనిర్బంధం చేసిన పోలీసులు

అరెస్టులు దారుణం

మహేశ్వరం: బాటసింగారం డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించడానికి వెళ్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు బీజేపీ నేతలను ముందస్తుగా అరెస్ట్ చేయడం దారుణమని ఆ పార్టీ మహేశ్వరం మండల అధ్యక్షుడు మాధవచారి అన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ నేతలను ఉదయం నుంచి హౌస్ అరెస్టులు చేశారు. అనంతరం మహేశ్వరం పోలీస్ స్టేషన్‌కు తరలించి మధ్యాహ్నం తర్వాత పూచీకత్తుపై విడుదల చేశారు. మహేశ్వరం ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్, డబిల్‌గూడ గ్రామసర్పంచ్ శంకర్, సిరిగిరిపురం గ్రామ సర్పంచ్ సురేష్, మండల బీజేవైఎం అధ్యక్షుడు వనంపల్లి శ్రావణ్, నాయకులు మాధవులు, ప్రకాష్ అరెస్టైన వారిలో ఉన్నారు.

ముంపు సమస్యకు పరిష్కారం



స్థానికులతో సమావేశమైన జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది

పహాడీషరీఫ్: నబీల్ కాలనీలో ముంపు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది తెలిపారు. కొత్తపేట 3వ వార్డు నబీల్ కాలనీలో స్థానికులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్లా సాది మాట్లాడుతూ నబీల్ కాలనీ, సీపీఎస్ఆర్, డ్రీమ్ సిటీ, గ్రీన్ సిటీలలో ఇప్పటికే రూ.10 కోట్ల వ్యయంతో ఎస్ఎన్‌డీపీ పనులు జరుగుతున్నాయని, నబీల్ కాలనీలో ఇంకా ముంపు సమస్య పూర్తిస్థాయిలో తీరలేదన్నారు. ఈ విషయమై స్థానికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మంత్రి సబితా రెడ్డి సహకారంతో రూ.3.25 కోట్ల వ్యయంతో మరో నాలాను నిర్మిస్తామని తెలిపారు. ఇందుకోసం స్థానిక రైతు ఉస్మాన్ మిశ్రీ తన వ్యవసాయ భూమిలో నుంచి లైన్ వేసేందుకు అంగీకరించారని పేర్కొన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అహ్మద్ కసాది పాల్గొన్నారు.

కార్పొరేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మేయర్ చిగురింత పారిజాత ఆదేశించారు. గురువారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ పారిజాత మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కార్పొరేషన్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, వాటర్ వర్క్స్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఈఈలు అశోక్‌రెడ్డి, జ్యోతి, హెచ్ఎండబ్ల్యూఎస్ డీఈఈ హరీశ్, ఏఈ వినీల్‌గౌడ్, మేనేజర్ నగేశ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పారిజాత

లోతట్టు ప్రాంతాల్లో భయం.. భయం



కొత్తపేటలోని ప్రధాన రహదారిలో...

దిల్‌సుఖ్‌నగర్: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మలక్‌పేట జోన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గురువారం ఉదయం నుంచి ఆగకుండా కురుస్తున్న వర్షానికి కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. వర్షం వల్ల డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు బయటకు వచ్చి రోడ్లపై ప్రవహిస్తుండంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. పలు రహదారులు వరద నీటితో గోదారిని తలపించాయి.

◆ కొత్తపేట, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి తదితర ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్

వర్షపు నీటితో ట్రాఫిక్ స్తంభించింది.

◆ వర్షానికి జోన్‌పరిధిలోని ఆర్‌కేపురం, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట, మున్సిపల్ కాలనీ, పద్మానగర్, కాలడేర, మలక్‌పేట రైల్వే బ్రిడ్జి, అజంపుర, సైదాబాద్, సరూర్ నగర్, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలు జలమయం అయ్యాయి.

◆ యాదవనగర్, అల్కాపురి, ఎన్‌టీఆర్‌నగర్, అంబేద్కర్‌నగర్, మార్గదర్శికాలనీ, శంకేశ్వరబజార్, వాంబేకాలనీ తదితర ఈప్రాంతాల్లోని నాలాలు పూర్తిగా పూడుకుపోయి మురుగునీరంతా రోడ్లపై కాలనీల్లో ప్రవహిస్తోంది.

పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు

◆ జోన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆర్‌కేపురం, సరూర్‌నగర్, ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్, మూసారంబాగ్, సైదాబాద్, కుర్మగూడలో డ్రైనేజీ పైపులు లీకై ఎక్కడి డ్రైనేజీ అక్కడనే పొంగిపొర్లుతోంది.

రైతుబీమాకు అర్జీ పెట్టుకోండి

తలకొండపల్లి: అర్హులైన రైతులందరూ రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు గురువారం తెలిపారు. జూన్ 18లోగా కొత్తగా పట్టాలు పొందిన రైతులంతా రైతుబీమాకు అర్హులుగా చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హులంతా ఆగస్టు 5లోగా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, నామినీ ఆధార్ జిరాక్స్ ధృవ పత్రాలను ఏఈఓలకు ఇవ్వాలని ఏఓ సూచించారు.

కార్యకర్తలను ఆదుకుంటాం

మంచాల: ఏ కార్యకర్త ఆపదలో ఉన్నా వారిని ఆదుకుంటామని పీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తాళ్లపల్లి గూడ గ్రామంలో పోలిమోని సత్తయ్య గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాంరెడ్డి.. మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు సత్తయ్య, గణేశ్, సంతోశ్‌గౌడ్,రమేశ్‌గౌడ్, ఐలేశ్, కిషన్, మహేందర్, మధు ఉన్నారు.

కాంగ్రెస్ నేతకు పితృవియోగం

మహేశ్వరం: మండలంలోని గొల్లూరు గ్రామ కాంగ్రెస్ సీనియర్ నేత మంద రాజు తండ్రి మంద బాలయ్య(70) అనారోగ్యంతో గురువారం మరణించారు. నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి బాలయ్య భౌతికాయానికి నివాళులర్పించారు. గొల్లూరు మాజీ సర్పంచ్ హరినాద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నర్సింహ తదితరులు రాజు కుటుంసభ్యులను పరామర్శించి ఓదార్చారు.

బడంగ్‌పేట కమిషనర్‌గా సుమన్‌రావు



సుమన్‌రావును సన్మానిస్తున్న గుర్ల శ్రీనివాస్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమీషనర్‌గా బి.సుమన్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సుమన్‌రావు రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఈయన మీర్‌పేట్ కమిషనర్‌గా కూడా విధులు నిర్వహించారు. నూతన కమిషనర్‌కు బడంగ్‌పేట కార్పొరేషన్ ఉద్యోగులు, సిబ్బంది, పాలకవర్గసభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు గుర్ల శ్రీనివాస్, మహిళా కన్వీనర్ ఇందుమతి, యామిని సుమన్‌రావును సన్మానించారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలి అదృశ్యం

గంటల వ్యవధిలోనే ఆచూకీ కనుగొన్న పోలీసులు

హస్తినాపురం: మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధురాలు అదృశ్యం కాగా, గంటల వ్యవధిలోనే పోలీసులు ఆమె ఆచూకీ కనుగొని కుటుంబసభ్యులకు అప్పగించారు. వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... వనస్థలిపురం నివాసం ఉండే వృద్ధురాలు వెంకట సుబ్బమ్మకు మతిస్థిమితం సరిగ్గా ఉండదు. గురువారం ఉదయం ఆమె ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన వనస్థలిపురం పోలీసులు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఆమె ఫొటో ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా వనస్థలిపురం పెట్రో మొబైల్ వాహనం ఇన్‌చార్జి ఏఎస్ఐ వేణుగోపాల్, ఆయన సిబ్బంది వృద్ధురాలి ఆచూకీని సాయంత్రానికి కనుగొన్నారు. ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం సీఐ జలేంధర్‌రెడ్డి వృద్ధురాలి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి వారికి అప్పగించారు.

బోనమెత్తిన అల్మాస్‌గూడ



పోచమ్మకు బోనం సమర్పిస్తున్న మేయర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో గురువారం బోనాల సందడి నెలకొంది. ముస్తాబు చేసిన బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా పోచమ్మ మైసమ్మ అమ్మవార్లకు భక్తులు సమర్పించారు. జోరువానను లెక్క చేయకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పోచమ్మకు బోనం సమర్పించారు. స్థానిక కార్పొరేటర్లు కవిత, స్వప్న, రాంరెడ్డి, మాధురి, పద్మ, దీపిక, లలిత తదితరులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాల ఉత్సవాల్లో మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శూరకర్ణారెడ్డి, ఐలయ్య, మాజీ సర్పంచ్ కృష్ణ, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హస్తినాపురం: వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని. ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని హస్తినాపుం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. గురువారం రాత్రి డివిజన్ పరిధిలోని భీమానగర్‌కాలనీ, సాగర్ ఎన్‌క్లేవ్‌కాలనీ, రెడ్డి కాలనీ, ద్వారకాతిరుమల కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. వరద నీటి వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ఇళ్లలోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె కోరారు. కార్పొరేటర్‌తో పాటు జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ కనకయ్య, ఏఈ హేమూనాయక్, బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి , రామచంద్ర నాయక్, వివిధ కాలనీల ప్రతినిధులు ఉన్నారు.



హస్తినాపురం ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

మండల ఏర్పాటులో వివక్ష

జేఏసీ నాయకుడు రేణురెడ్డి

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకులు రేణురెడ్డి అన్నారు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం 18వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రేణురెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు గట్టుఇప్పలపల్లి మండల ఏర్పాటులో వివక్షత చూపిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి మండలం ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు కొనసాగుతయన్నారు. ఈ కార్యక్రమంలో దామోదర్, డేవిడ్, పవన్ వాల్మీకి, కృష్ణాజీ, ఆగయ్య, కృష్ణయ్య, చంద్రయ్య, విజయ్, రామకృష్ణ, అంజయ్య, నరహరి, యాదయ్య, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు, రేణురెడ్డి తదితరులు

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

ఏబీవైఎంఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య

మంచాల: రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే చేపట్టాలని అఖిల భారత యాదవ మహాసభ(ఏబీవైఎంఎస్) మండల అధ్యక్షుడు ఐలయ్య, ప్రధాన కార్యదర్శి వట్టి యాదయ్య డిమాండ్ చేశారు. గురువారం యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్ జంగయ్యగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. నిరుపేద యాదవులు అప్పులు చేసి డీడీలు కడితే మొదటి విడత మాత్రమే పంపిణీ చేసి నేటికీ రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జెనిగె వెంకటేశ్ యాదవ్, ఐలేశ్ యాదవ్, కసరమోని రాజేశ్, శ్రీశైలం, నర్సింహ, మహేందర్, ప్రశాంత్, యాదయ్య, మల్లయ్య, విష్ణు, సురేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ నియామకం

మండల పరిధిలోని తిప్పాయిగూడలో ఏబీవైఎంఎస్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీశైలం యాదవ్, ఉపాధ్యక్షులుగా కొమురయ్య, అడివయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆవుల శివకుమార్, సంయుక్త కార్యదర్శులుగా శేఖర్, మల్లేశ్, రాజేశ్, ఉపాధ్యక్షులుగా మహేశ్, వెంకటేశ్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శులు సీత మల్లేశ్, శివకుమార్ తదితరులను ఎన్నుకున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న యాదవ మహాసభ నాయకులు